RNI : APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్ | సోమవారం 02 డిసెంబర్ 2024 | సంపుటి : 12 | సంచిక : 304 | పేజీలు : 8 | వెల : 4/-



ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జైషా

5 లో..

## ఉలిక్కిపడ్డ ఉత్తర తెలంగాణ



2 లో..

### తెలంగాణ-ఛత్తీస్ ఘడ్ సరిహద్దులో భారీ ఎన్ కౌంటర్

ఏడుగురు 'మావోయిస్టులు' హతం

- తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 'తొలి ఎన్ కౌంటర్'
- 'పీఎల్జీఏ' వారోత్సవాల టైంలో ఘటన
- అప్పట్లో 'మందుపాతర' పేలిన ప్రాంతంలోనే ఈ ఎన్ కౌంటర్.?

ఒక్కసారిగా ఉత్తర తెలంగాణ ఉలిక్కిపడింది. తెలంగాణ-ఛత్తీస్ఘడ్ సరిహద్దులో ఆదివారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది.తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరగ్గా ఏడుగురు మావోయిస్టులు మృతిచెందినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక..పదేళ్ల తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చానీయాంశమైంది. - జగిత్యాల







## సంక్రాంతి తర్వాత

# రైతు భరోసా

### అన్నదాతల ఖాతాల్లో జమ గ్యారంటీ నాది

- ఈ అసెంబ్లీ సమావేశాల్లో విధి విధానాలు ఖరారు
- సన్నాలకు రూ.500 బోనస్ కొనసాగుతుంది
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ
- తెలంగాణ సోనా, బీపీటీ, హెచ్ఎంటీ వంటి రకాలు పండించాలని రైతులకు విజ్ఞప్తి
- రూ.2 లక్షల వరకూ రుణమాఫీ 100 శాతం పూర్తయినట్లు స్పష్టీకరణ

"2023 వానాకాలం రైతుబంధు (ప్రస్తుత రైతు భరోసా)ను కేసీఆర్ ఎగ్గొట్టారు. మేం అధికారంలో రాగానే రూ.7,625 కోట్ల రైతుబంధు బకాయిలను చెల్లించాం. కొత్తగా ఈ పథకం అమలుపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశాం. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో విధివిధానాలు ఖరారు చేసి, సంక్రాంతి పండగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమచేస్తాం. భవిష్యత్‌లోనూ ఈ పథకం కొనసాగుతుంది" అని సీఎం స్పష్టం చేశారు.

**హైదరాబాద్, డిసెంబర్1 :** సంక్రాంతి పండుగ తర్వాత రైతు భరోసా చెల్లిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్‌లో జరిగే శాసనసభ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి విధివిధానాలు ఖరారు చేసి సంక్రాంతి తర్వాత రైతు భరోసా చెల్లిస్తామన్నారు. ఈ విషయంలో మారీచుల మాటలను విశ్వసించరాదని రైతాంగానికి సూచించారు. ప్రజా ప్రభుత్వం - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా పాలమూరు జిల్లాలో జరిగిన రైతు పండుగ విజయవంతమైన నేపథ్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి

మిగతా 2 లో

### కాంగ్రెస్‌కు ప్రజలే ఘోరీ కడుతారు

- ఆరు గ్యారంటీలు ఎక్కడా అమలు కాలేదు
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ట్వీట్

03




కాంగ్రెస్ అన్ని రంగాల్లో

### విఫలం

మాజీ మంత్రి హరీశ్‌రావు



04



02

కొమురవెల్లి ప్రసాదంలో

### పురుగులు



## ప్రతి ఎకరాకు

# సాగునీరు

లక్ష మందితో డిసెంబర్ 4న పెద్దపల్లిలో బహిరంగ సభ

### త్వరలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి

- రికార్డు స్థాయిలో కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి
- సన్న రకం ధాన్యం 2800 కంటే తక్కువ ధరకు ప్రైవేట్ లో అమ్ముకుండా చర్యలు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రాజెక్టులు, పౌరసరఫరాల విభాగంపై సమీక్ష

**నేటి సాక్షి, కరీంనగర్/పెద్దపల్లి :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ప్రతి ఎకరానికి సాగునీరు అందే విధంగా పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రోటోకాల్

మిగతా 2 లో

## 6 అబద్ధాలు..

# 66 మోసాలు

### కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై బీజేపీ చార్జిషీట్

- పార్టీ నేతలతో కలిసి కిషన్‌రెడ్డి విడుదల
- హామీలు నెరవేర్చకుండా సంబురాలేంటి?
- రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు!
- సర్కారుపై బీజేపీ తీవ్ర విమర్శలు

03



రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు అనేక రకాల గ్యారంటీలను ఇచ్చి.. వాటిని నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. మారింది పాలకులే కానీ పాలన కాదని, పది సంవత్సరాల భారాస పాలనకు... ఏడాది కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడా లేదని ధ్వజమెత్తారు. విఫలమైన హామీలను ప్రజల ముందు ఛార్జ్‌షీట్ రూపంలో పెడుతున్నామని ఆదివారం సోమాజిగూడలో భాజపా ఛార్జ్‌షీట్ విడుదల చేసింది.



02

### మేకల మందపై

## పులిదాడి

ఆసిఫాబాద్‌లో జిల్లాలో ఆగని పులి దాడి ఘటనలు

### బీఆర్ఎస్, కాంగ్రెస్‌పాలనపై

## చర్చిద్దాం రండి!

- కేటీఆర్, హరీశ్‌రావు ఎవరొస్తారండి
- ఎల్బీ స్టేడియంలో చర్చ పెడుదాం
- కేటీఆర్, హరీశ్ రావుకు నిద్ర పట్టలేదు..
- అందుకే ఇలాంటి ప్రచారం చేస్తున్నారు
- బీఆర్ఎస్‌విమర్శలకు జూపల్లి కౌంటర్

02



## దానాపూర్ సమీపంలో
# మేకలపై పులి దాడి

**ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ మండలంలోని దానాపూర్ గ్రామ సమీపంలో మేకల మందపై పులి దాడి చేసింది. మేకల కాపరి పులి వచ్చినట్లు గమనించగానే గ్రామంలోకి పరుగులు తీసి విషయం తెలిపారు. గ్రామస్తులు అటవీ అధికారులకు విషయం తెలిపి అక్కడికి వెళ్లి చూడగా ఎనిమిది మేకలకు గాను ఒక మేక చనిపోయి ఉండగా, మరో మేక గాయపడి, ఇంకొక మేక కనిపించకుండా పోయింది. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ సింగ్ సర్దార్, డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, బీట్ అధికారులు రాజేష్, సాదిక్, వెంకటేష్ లు అక్కడికి చేరుకొని పులి దాడి చేసిందా లేదా చిరుత పులి దాడి చేసిందా అనే విషయాన్ని తెలుసుకోవడానికి పరిసర ప్రాంతాల్లో కలియతిరిగారు. దాదాపు నాలుగు గంటల పాటు అటవీ ప్రాంతంలో తిరిగిన వారికి ఆనవాళ్లు పూర్తిగా కనిపించకపోవడంతో స్పష్టతకు రాలేకపోయామని తెలిపారు. ఏది ఏమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి అవునా కాదా అనే విషయం తెలియజేయడానికి మరింత సమయం పడుతుందని వివరించారు.

# కొమురవెల్లి ప్రసాదంలో పురుగులు

**కొమురవెల్లి, డిసెంబర్1:** తెలంగాణలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటి కొమురవెల్లి మల్లన్న ఆలయం. అయితే తాజాగా కొమురవెల్లి మల్లన్న ప్రసాదంలో పురుగులు రావడం భక్తులను విస్మయానికి గురి చేస్తుంది. అయితే ఇన్ని రోజులు తిరుపతి లడ్డులో కల్తీ నెయ్యికి సంబంధించిన వార్తలు భక్తులు మారవా ముందే ఇప్పుడు ఈ కొమురవెల్లి ప్రసాదంలో పురుగులు రావడం భక్తులకు కోపాన్ని తెప్పిస్తుంది. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భక్తునికి ప్రసాదంలో పురుగు రావడంతో ఆశ్చర్యపోయి అక్కడి సిబ్బందిని ప్రశ్నించగా, వారి సరైన సమాధానం ఇవ్వకపోగా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు అని అక్కడి వారు చెబుతున్నారు. అలాగే కొమురవెల్లి మల్లన్న ప్రసాదం అయిన లడ్డు, పులిహోరలో తయారీ లోపాలు ఉంటున్నాయని పేర్కొంటున్నారు. ఇక ఇరుపతి లడ్డు ఘటన మరవక ముందే ఇప్పుడు ఇక్కడ ఇలా జరగడం భక్తుల భావాలను దెబ్బ తీస్తున్నాయి అంటున్నారు. కొమురవెల్లిలో గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయి అని.. అయినా కూడా సిబ్బంది పట్టించుకోవడం లేదు అని భక్తులు తెలుపుతున్నారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌పాలనపై
# చర్చిద్దాం రండి!

**కేటీఆర్, హరీశ్‌రావు ఎవరొస్తారండి**

**ఎల్బీ స్టేడియంలో చర్చ పెడుదాం**

**కేటీఆర్, హరీశ్ రావుకు నిద్ర పట్టలేదు..**

**అందుకే ఇలాంటి ప్రచారం చేస్తున్నారు**

**బీఆర్ఎస్‌విమర్శలకు జూపల్లి కౌంటర్**



**హైదరాబాద్, డిసెంబర్1 :** రైతు పండగ చూసి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుకు నిద్ర పట్టలేదని, సోషల్ మీడియాతో తిమ్మిని బమ్మిని చేసి ప్రచారం చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. మహబూబ్ నగర్‌లో భారీ ఎత్తున రైతు పండగ సభ నిర్వహించారని, పాలమూరు ప్రజల తరపున సీఎంకు ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు గత పదేళ్లలో పూర్తి కాలేదని, ప్రాజెక్టులు అన్నీ కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించాయని చెప్పారు. కేసీఆర్ ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వలేదని, మరో 40-50 వేల కోట్ల రూపాయల ఖర్చు చేస్తే ప్రాజెక్టులు పూర్తి అవుతాయని తెలిపారు. ఇప్పటివరకు 20-30 శాతం మాత్రమే ప్రాజెక్టుల పనులు జరిగాయని చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ గొప్ప పాలన చేస్తే పది లక్షల కోట్ల రూపాయల అప్పులు ఎందుకు అయ్యాయని జూపల్లి కృష్ణారావు నిలదీశారు. నెలకు ఆరువేల కోట్ల రూపాయలు వడ్డీలు కట్టాల్సి వస్తుందని తెలిపారు. రింగురోడ్డును అమ్ముకున్నారని, గత పాలనలో మంత్రులకు ప్రగతి భవన్ లోకి ఆహ్వానం లేదని చెప్పారు. సెక్రటేరియట్లోకి ఎమ్మెల్యేలకు అనుమతి లేదని, ప్రతిపక్ష పార్టీల గారడీలో ప్రజలు పడకుండా ఉండాలని అన్నారు. కాంగ్రెస్ పాలన దేశానికి, రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని చెప్పారు.

### ఎవరొస్తారో రండి..

ఎల్బీ స్టేడియం వేదికగా గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై చర్చి ద్దామని అంటూ జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. తాను చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం లెక్కలు తప్పని నిరూపించాలన్నారు. గడిచిన పదేళ్లు బీఆర్ఎస్ నిజంగా గొప్ప పాలనే చేసి ఉంటే ధనిక రాష్ట్రమైన తెలంగాణ అప్పుల కుప్పగా ఎందుకైందో చెప్పాలని మంత్రి ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు వాస్తవాలను వక్రీకరిస్తున్నారని ఫైర్ అయ్యారు. రుణమాఫీ " పేరుతో రైతుబంధును ప్రభుత్వం ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదని బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. రైతుబంధు ఇవ్వాలంటే రూ.7 వేల కోట్లే అవసరం అవుతుందని గత ప్రభుత్వం అప్పులు చేయకపోయి ఉంటే నెలకు ఓసారి అయినా ఇవ్వొచ్చని పేర్కొ న్నారు. తెలంగాణ ప్రజల సొమ్మును బీఆర్ఎస్ పెద్దలు దోచుకోవడం తోపాటు తమవారికి దోచిపెట్టారని ఆరోపించారు. అక్షయపాత్ర లాంటి రింగ్ రోడ్డును రూ.7 వేలకోట్లకు అమ్ముకున్నారని ధ్వజమెత్తారు.

## కాంగ్రెస్‌కు ప్రజలే
# ఘోరి కడుతారు

**ఆరు గ్యారంటీలు ఎక్కడా అమలు కాలేదు**

**కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ట్వీట్**



**హైదరాబాద్, డిసెంబర్1 :** కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఎక్కడా అమలు చేయలేదని, హామీలను విస్మరిస్తే ప్రజలే ఆ పార్టీకి గుణపాఠం చెబుతారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. దేశంలోని పలు రాష్ట్రాల ఎన్నికల్లో గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసగిస్తుందని, 6 గ్యారంటీలు ఏడా అమలు జెయ్యలేదని విమర్శించారు. కర్ణాటకలో 6 అన్నరు.. చేతులెత్తిసింద్రని, తెలంగాణలో మళ్లీ 6 అన్నరు.. దుకాణం బంద్ చేసింద్రని, మహారాష్ట్రలో 6 అనగానే... గీళ్ల దుకాణమే బంద్ చేసి బుద్ధిచెప్పింద్రని.. ఖబర్దార్ కాంగ్రెస్..6 గ్యారంటీలు అమలు చేయకుంటే.. ప్రజలే మీకు ఘోరీ కడుతారని బండి సంజయ్ హెచ్చరించారు. తెలంగాణలో మారింది పాలకులేనని, పాలన కాదని, మార్పురాలే ప్రజల బతుకులు మారలేదని కాంగ్రెస్ పాలనప విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరంతో లక్ష కోట్ల దోపిడీ, కాంగ్రెస్ పాలనలో మూసీ పేరుతో లక్షన్నర కోట్లకు ఎసరు అని, అప్పుడు 12మంది ఎమ్మెల్యేలను గుంజుకున్నారని, ఇప్పుడు 10మంది ఎమ్మెల్యేలను కొన్నారని విమర్శించారు. ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పాలకులు 80వేల కోట్ల అప్పులు చేస్తే కాంగ్రెసోళ్లు కూడా అదే చేస్తున్నారన్నారు. అప్పుడు పదేళ్ల పాటు కే ట్యాక్స్ అని, ఇప్పుడు అన్నింటా అర్ఆర్ ట్యాక్స్ అని ఆరోపించారు. నాడు ధరణితో 10లక్షల ఎకరాల భూములు మయాం చేస్తే, నేడు హైడ్రా, ఫోర్త్ సిటీ పేరుతో లక్షల ఇండ్లను కూల్చుతున్నారన్నారు. ఆడబిడ్డలకు జీరో వడ్డీ అని బీఆర్ఎస్ వాళ్లు మోసం చేస్తే, స్కూటీ, తులం బంగారం పేరుతో కాంగ్రెసోళ్లు మోసం చేశారని బండి సంజయ్ విమర్శించారు.

# సంక్రాంతి తర్వాత రైతు భరోసా

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు పండుగలో ప్రత్యక్షంగా పాల్గొన్న రైతాంగం, రాష్ట్ర వ్యాప్తంగా 568 రైతు వేదికల ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్న లక్షలాది రైతులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. "సంక్రాంతి పండుగ తర్వాత రైతు భరోసా చెల్లించేది గ్యారెంటీ. ఈ విషయంలో ఎవరినీ నమ్మకండి. రైతు భరోసా విధివిధానాలను ఖరారు చేయడానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారు, మంత్రులు తుమ్మల గారు, పొంగులేటి గారి నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించాం' అని చెప్పారు. ఈ నెలలో జరిగే శాసనసభ సమావేశాల్లో విధివిధానాలపై చర్చించి సంక్రాంతి తర్వాత రైతు భరోసా చెల్లిస్తామని హామీ ఇస్తున్నామని, రైతు భరోసా పథకం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పరంగా వాస్తవాల ప్రాతిపదికన కొన్ని అంశాలు చర్చించుకుని ముందుకు వెళ్లడం ద్వారా రైతాంగానికి, మహిళలకు, విద్యార్థినీ విద్యార్థులకు ఒక మంచి పాలన అందించడం సాధ్యమవుతుంది. రాష్ట్రం ఏర్పడే నాటికి 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ తో 69 వేల కోట్ల అప్పులు ఉండేవి. సరిగ్గా పదేళ్లు పూర్తి చేసుకున్న తర్వాత తెలంగాణకు 7 లక్షల కోట్ల అప్పు ఉంది. ఆ అప్పుపై అసలు, మిత్తి కలిపి ప్రతి నెలా 6,500 కోట్ల రూపాయలు చెల్లించే పరిస్థితి ఉంది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టి తర్వాత వాస్తవ పరిస్థితులు ప్రజలకు వివరించాలన్న ఉద్దేశంతో ఆస్తులు, అప్పులు, విద్యుత్, సాగునీటి రంగాలపై శ్వేతపత్రం విడుదల చేశాం. ఆ లెక్కల ప్రకారం 7 లక్షల కోట్ల అప్పులు తేలాయి. గత ప్రభుత్వం చెల్లించాల్సిన రైతు బంధు చెల్లించకుండా బకాయి పెడితే, అధికారం చేపట్టిన వెంటనే 7,625 కోట్ల రూపాయలు తమ ప్రభుత్వం చెల్లించింది. నాలుగు విడతల్లో కలిపి మొత్తంగా 25,35, 964 మంది రైతు కుటుంబాలకు 20,616.89 కోట్ల రూపాయల మేరకు రుణ మాఫీ చేశాం. మొదటి విడత 18-07-2024 నాటికి లక్ష రూపాయల లోపు ఉన్న 11,34,412 మంది రైతులకు 6034.96 కోట్ల రూపాయలతో రుణమాఫీ చేశాం. రెండో విడతలో6,40, 823 మంది రైతులకు 6,190.01 కోట్ల రూపాయల మే-రకు రుణ మాఫీ జరిగిందన్నారు. మూడో విడతలో 4,46,832 మంది రైతులకు 5,644.25 కోట్ల రూపాయల మేరకు రుణ మాఫీ అయ్యిందన్నారు. నాల్గో విడతలో గతంలో సాంకేతిక లోపాలు, రేషన్ కార్డు లేదా బ్యాంకుల్లో లోపాల వంటి కారణాలతో నిలిచిపోయిన 3,13,897 మంది రైతు కుటుంబాలకు 2747.67 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో వేసినట్టు చెప్పారు. 2018 ఎన్నికల తర్వాత గత ప్రభుత్వం రుణ మాఫీ 4 ఏండ్ల పాటు సాగదీస్తూ విడత వారిగా చెల్లించడంతో వడ్డీలకే పోయిందని, 2018-23 మధ్య ఐదేండ్ల కాలంలో 3,3031 కోట్ల మాత్రమే అసలు రుణ మాఫీ చేసింది. గత ప్రభుత్వం 2023 వానాకాలం చెల్లించకుండా వదిలేసిన రైతు బంధు బకాయిలు 7,625 కోట్ల రూపాయల కూడా ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే చెల్లించింది. గతంలో... వరి వేస్తే ఉరి వేసుకోవలసిందే. ధాన్యం కొనుగోలు కేంద్రాలే ఉండవని చెప్పిన పరిస్థితుల నుంచి వరి వేసుకోండి. కొంటామని చెప్పి భరోసా ఇవ్వడంతో పాటు సన్నాలు వేసుకుంటే బోనస్ ఇస్తామని ప్రోత్సహించాం. వర్షాకాలంలో సన్నాలకు బోనస్ ఇచ్చాం. బోనస్ ఒక్కసారి ఇచ్చి వదిలేయడం కాదు. వచ్చే సీజన్ లో కూడా బోనస్ ఇస్తాం. తెలంగాణ సోనా, బీపీటీ, హెచ్ఎంటీ వేయాలి. తెలంగాణ ప్రజలు అత్యధికంగా ఈ బియ్యం ఎక్కువగా తింటారు. రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వంటి ప్రభుత్వ వసతి గృహాల్లో సన్న బియ్యంతో అన్నం పెట్టనున్నాం అని ముఖ్యమంత్రి అన్నారు.

# ఉలిక్కిపడ్డ ఉత్తర తెలంగాణ

(జగిత్యాల బ్యూరో/మంగపేట)





ఒక్కసారిగా ఉత్తర తెలంగాణ ఉలిక్కిపడింది. తెలంగాణ-ఛత్తీస్గఢ్ సరిహద్దులో ఆదివారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది.తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరగ్గా ఏడుగురు మావోయిస్టులు మృతిచెందినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక..పదేళ్ల తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చానీయాంశమైంది.

### పీఎల్జీఏ వారోత్సవాల టైంలో..

ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్జీఏ -పీపుల్స్ గెరిల్లా ఆర్మీ) ఆవిర్భవించి 25 సంవత్సరాలు అవుతున్న తరుణంలో డిసెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వార్షికోత్సవాలు జరుపుకోవాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. సోమవారం డిసెంబర్-2 నుంచి వార్షికోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఒక్కరోజు ముందే చెల్పాక, అటవీ ప్రాంతంలో భారీ ఎన్ కౌంటర్ జరగడం కలకలం సృష్టించింది.

### ఉరవసారి గుట్టకింద..

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని సీమలదొడ్డి,ఐలాపూర్, అటవీ ప్రాంతం ఉరవసారి గుట్ట సమీపంలో ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న పోలీసులకు సుమారు 20మంది సభ్యులున్న మావోయిస్టు దళం ఎదురైంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య 30 నిమిషాలపాటు ఎదురుకాల్పులు జరిగాయి. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించగా, ఏడుగురు మావోయిస్టులు మృతి చెందగా.. మరి కొంత మందికి తీవ్ర గాయాలు అయినట్టు తెలుస్తోంది.

### అసువులు బాసిన మావోయిస్టులు వీరే.!

ములుగు జిల్లా ఏటూరు నాగరం మండలం చెల్పాక వద్ద జరిగిన పోలీసు ఎన్ కౌంటర్ లో అసువులు బాసిన మావోయిస్టుల పేర్లు ప్రకటించారు. కుర్సం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న(35), ఏగోళపు మల్లయ్య అలియాస్‌మధు(43), ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్(22), ముస్సాకి జమున(23), జైసింగ్(25), కిషోర్(22), కామేష్(23) మృతి చెందారు. వీరి వద్ద నుంచి తూటాలు, డిటోనేటర్, మందుగుండు సామాగ్రి, విప్లవ సాహిత్యం, కిట్‌బ్యాగు, నిత్యావసర వస్తువులు లభ్యమయ్యాయని పోలీసులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులకు సమాచారం ఇచ్చి మృత దేహంతోపాటు లభ్యమైన సామగ్రిని స్వాధీన పరుచుకున్నారు. తెలంగాణ గ్రేహౌండ్స్-యాంటీ మావోయిస్టు స్క్వాడ్ లు సంయుక్తంగా ఈ ఆపరేషన్ ను చేపట్టాయి.

### కొన్నేళ్ల క్రితం జరిగిన 'మందుపాతర' ఘటనకు 'ప్రతీకారమా.!?

మావోయిస్టు కీలక నేత భద్రు సహా ఏడుగురు మృతి చెందడంతో అటవీప్రాంతంలో కలకలం రేపింది. చల్పాక సమీపంలోని అటవీప్రాంతంలో ఘటన జరగ్గా.. ఘటనాస్థలంలో ఏడు మృతదేహాలు.. రెండు ఏకే-47 రైఫిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటీ దాదాపు తుడిచిపెట్టుకు పోయిందని అంటున్నారు. అయితే..సరిగ్గా ఇదే ప్రాంతంలో గతంలో ఘోర ఘటన జరిగింది. కొన్నేళ్ల క్రితం ఏటూరునాగారంలోని చెల్పాకలో ఒళ్లు గగ్గుర్పొడిచే ఘటన చోటు చేసుకుంది. 'పీపుల్స్ వార్' మందుపాతరకు పోలీసులు జీపు ఎగిరిపడి.. పోలీసుల అవయవాలు.. చెట్లపై పడిన ఘటన ఇక్కడే చోటు చేసుకుంది. ఈ ఘటనలో సీఐ, ఎస్సైలు మరణించగా.. కానిస్టేబుళ్లు గాయాలతో బయటపడ్డారు. మళ్లీ ఇదే ప్రాంతంలో ఇప్పుడు భారీ ఎన్ కౌంటర్ జరగడంతో.. ఆ ఘటనకు పోలీసులు ప్రతీకారం తీర్చుకున్నారా.? ఏంటని.. అటవీప్రాంతంలో అందరూ గుర్తు చేసుకుంటున్నారు.



# ప్రతి ఎకరాకు సాగునీరు

మొదటి పేజీ తరువాయి

ప్రజా సంబంధాల ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తో కలిసి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పౌరసరఫరాల శాఖ విభాగంపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ హెలిపాడ్ వద్దకు చేరుకున్న మంత్రుల బృందానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పుష్ప గుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. ధాన్యం కొనుగోలు పై అధికారుల తీసుకోవాల్సిన చర్యల గురించి పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వ పనులు, కాళేశ్వరం ప్యాకేజ్ 9 పెండింగ్, చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకం, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం, రామగుండం ఎత్తిపోతల పథకం, ఎల్లంపల్లి కెనాల్ నెట్ వర్క్ ప్యాకేజ్ 2 పనులు, ధాన్యం సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తదితర అంశాల పై మంత్రి ఉత్తమ్ సుదీర్ఘంగా చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మన రైతులు పండించారని మంత్రి తెలిపారు. గతంలో ఎక్కడా లేని విధంగా సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ చెల్లిస్తుందని అన్నారు. రైతులకు ఎక్కడా తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైతులకు రికార్డు సమయంలో వడ్ల డబ్బులు పడ్తున్నాయని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ సంతృప్తి కరంగా ఉందని అన్నారు. డిసెంబర్ 4న సీఎం పర్యటన ఉన్న సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి రైస్ మిల్లులు/ ఇంటర్మీడియట్ గోదాములకు తరలించాలని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే గంటల వ్యవధిలో రైతులకు మద్దతు ధర, బోనస్ చెల్లించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సమయానికి 100% ధాన్యం డబ్బులు చెల్లించి ఉండాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సన్న రకం ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అధికంగా కొనుగోలు చేయాలని, ప్రైవేట్ వ్యాపారులు ఎక్కడ 2800 కంటే తక్కువ ధరతో సన్న రకం ధాన్యం కొనుగోలు చేయకుండా చూడాలని అన్నారు. రాబోయే సంవత్సరంలో రేషన్ లో సన్న బియ్యం ఇస్తున్నామని, దీనికి అనుగుణంగా కనీసం 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర గడిచిన నేపథ్యంలో డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లాలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, తమ ప్రభుత్వం 10 నెలల కాలంలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని అన్నారు. సీఎం సభకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. తక్కువ ఖర్చుతో రైతులకు సాగు నీరు అందించే పనులు ప్రాధాన్యతతో చేపట్టాలని మంత్రి ఉత్తమ్ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. సమృద్ధిగా నీరు అందుబాటులో ఉంటూ, కాస్ట్ బెనిఫిట్ నిష్పత్తి సానుకూలంగా ఉన్న పనులను సంబంధిత ఎమ్మెల్యే లతో కలిసి సమన్వయం చేసుకుంటూ ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు.

# సీఎం సభాస్థలి పరిశీలన

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రంగంపల్లి సబ్ స్టేషన్ వద్ద డిసెంబర్ 4న లక్ష మందితో యువ శక్తి బహిరంగ సభ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని, ఇందులో రేవంత్ రెడ్డి పాల్గొంటారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం పెద్దపల్లి మండలం రంగంపల్లి సబ్‌స్టేషన్‌వద్ద ముఖ్యమంత్రి సభాస్థలి ప్రాంగణాన్ని మంత్రులు డీ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రోటోకాల్ ప్రజా సంబంధాల ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తో కలిసి పరిశీలించారు. ఏర్పాట్ల పై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ, 2023 ఎన్నికలలో తెలంగాణ ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని, డిసెంబర్ 7న ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని, గత సంవత్సర కాలంలో తెలంగాణ రైతులు ఎస్సీలు ఎస్టీలు, అణగారిన వర్గాలు, మహిళల మేలు కొరకు ప్రభుత్వం పని చేసిందని అన్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్నందున డిసెంబర్ 4న జరిగే సీఎం సభకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. డిసెంబర్ 4న జరిగే ముఖ్యమంత్రి సభకు పెద్ద ఎత్తున రైతులు, యువత మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని , స్థానిక ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్య నారాయణ, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పామెలా సత్పతి, సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు, జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్, పెద్దపల్లి అదనపు కలెక్టర్ లు డి.వేణు, జే.అరుణ శ్రీ, అదనపు కలెక్టర్ , రెవెన్యూ డివిజన్ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 6 అబద్ధాలు.. 66 మోసాలు

- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై బీజేపీ చార్జిషీట్
- పార్టీ నేతలతో కలిసి కిషన్‌రెడ్డి విడుదల
- హామీలు నెరవేర్చకుండా సంబురాలేంటి?
- రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు!

సర్కారుపై బీజేపీ తీవ్ర విమర్శలు



**హైదరాబాద్, డిసెంబర్1 :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం కాంగ్రెస్ గ్యారెంటీలపై బీజేపీ తాజాగా చార్జిషీట్ విడుదల చేసింది. "కాంగ్రెస్ గ్యారెంటీల గారడీ: 6 అబద్ధాలు, 66 మోసాలు" పేరుతో ఈ చార్జిషీట్ రూపొందించింది. దీనిపై తెలంగాణ బీజేపీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. 100 రోజుల్లో గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి మాట తప్పారని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీని ఈ ఏడాది కాలంలో నెరవేర్చలేదని అన్నారు. కాంగ్రెస్ పాలనపై ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని కిషన్ రెడ్డి తెలిపారు. ఏమీ చేయకుండానే, కాంగ్రెస్ జరుపుకుంటున్న విజయోత్సవాలు చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారని వ్యాఖ్యానించారు. విజయోత్సవాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సంబరాలు చేసుకోవడమేంటని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు ఏ ఆశయాల కోసం పోరాడి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నారో.. ఆ ఆశయాలకు విరుద్ధంగా బీఆర్ఎస్ పాలన కొనసాగిందన్నారు. కుటుంబ పాలన.. అహంకార పూరితంగా కేసీఆర్ పాలన కొనసాగిందన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పరిపాలన కూడా కొనసాగుతోందని విమర్శించారు. అబద్దాల హామీలను ప్రకటించి కాంగ్రెస్ పార్టీ అధికారం సాధించిందన్నారు. వంద రోజుల్లో పూర్తి చేస్తానని చెప్పిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ విఫలమైందన్నారు.

# ఏడాది పాలనలో కాంగ్రెస్ విఫలం

- బేకారు సర్కారు అని ప్రజలు అంటున్నారు
- సీఎంనే సొంత డబ్బా కొట్టుకుంటున్నారు
- పూర్తిస్థాయి రుణమాఫీ చేసి పండుగ చేయండి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, డిసెంబర్1 :** ఏడాది కాంగ్రెస్ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సర్కారు ఉత్త బేకారు ఉన్నదని ప్రజలు అనుకుంటున్నరని చెప్పారు ఎవరు మెచ్చుకునే పరిస్థితి లేదు గనుక, ముఖ్యమంత్రి తన భుజం తానే తట్టుకుంటున్నడు. మాది సుపరిపాలన అని డబ్బా కొట్టుకుంటున్నడు. 'నీది సుపరిపాలన అని ప్రజలు చెప్పాలె. నువ్వు కాదు రేవంత్ రెడ్డి. నీ అపరిపక్వత (ఇమ్మెచ్యూరిటీ), నీ అసమర్థత (ఇన్ క్యాపబులిటీ), నీ ప్రతికూల వైఖరి (నెగిటివ్ ఆటిట్యూడ్) వల్ల రాష్ట్రంలో నేడు అన్నిరంగాల్లో ప్రతికూల వాతావరణం నెలకొన్నది' అని అన్నారు. తాము మంచి ఆర్థిక వృద్ధితో రాష్ట్రాన్ని అప్పగిస్తే, నీ రాక తర్వాత ఆశించిన మేరకు ఆర్థిక వృద్ధి రేటు పెరగలేదన్నారు. వృద్ధి రేటు పెంచే సత్తా లేదు, సంపద పెంచలేక, ప్రజలకు పంచలేక నోటికి వచ్చినట్లు వాగుతున్నావు. నెపం ప్రతిపక్షం మీదకు నెట్టుతున్నవు. ఆడరాక మద్దెల ఓడు అనే సామెతకు నీ మాటల్ని మించిన నిదర్శనం లేదు. ఈ ప్రభుత్వానికి ఆదాయం పెంచే సత్తా లేదు. ఇచ్చిన హామీలు అమలు చేసే చిత్తశుద్ధి లేదు. ప్రజలకు వాస్తవం చెప్పే దమ్ము లేదు. రైతు బంధును ఎవరు ఎగ్గొట్టారో ప్రజలకు తెల్వదా? ప్రజల విజ్ఞత మీద నీకు చాలా తక్కువ అభిప్రాయం ఉందన్నారు. మీకు దమ్ముంటే, రైతుల మీద నిజమైన ప్రేమ ఉంటే, మీది నిజమైన ప్రజాపాలనే అయితే సంపూర్ణ రుణమాఫీతో పాటు, వరంగల్ డిక్లరేషన్ ను తు.చ. తప్పకుండా అమలు చేలయాని, అప్పుడే రైతు పండుగ చేయాలని డిమాండ్‌చేశారు.

# వచ్చే పుష్కరాలు వైభవంగా నిర్వహిస్తాం

- పవిత్ర కార్తీక మాసం చివరి రోజు శాస్త్రోక్తంగా 'మహా హారతి'
- ధర్మపురి నదీ తీరంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్



**ధర్మపురి :** ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నది వద్ద ఆదివారం రోజున నిర్వహిం చిన మహ హారతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభు త్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గోన్నారు. ఈ సందర్భంగా గోదావరి వద్ద వేద పండితులు నిర్వహిం చిన పూజాధికార్యక్రమల్లో పాల్గొని గోదావరి నదీమతల్లికి మండల నాయకులు,అధికారులతో కలిసి హారతి ఇచ్చారు.ఈ సందర్భంగా మహిళలకు కార్తీక మాసం సందర్భంగా ప్రభుత్వం నుండి వచ్చిన తాంబులలను మహిళలకు పంపిణీ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ.. పవిత్ర కార్తీక మాస చివరి రోజైన ఆదివారం ధర్మపురి పుణ్య క్షేత్రంలో నిర్వహించే మహాహారతిలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని,గత నెల రోజుల నుండి కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి గోదావరి నదీమ తల్లికి హారతి కార్యక్రమన్ని వైభవోపేతంగా నిర్వహించడం జరిగిందని, ఈ ప్రాంత ప్రజల పై గోదావరి నదీమతల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని,ఆ లక్ష్మీ నరసింహ స్వామి వారి కృప కటాక్షాలు రాష్ట్ర ప్రజానీకం పైన ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. రానున్న పుష్కరాలు కూడా వేద పండితుల, అర్చకుల సూచనల మేరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని అడ్లూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు,అర్చకులు, మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ బదిలీలో అక్రమాలు

- చేతులు మారుతున్న డబ్బులు
- స్థానికులను వదలి ఇతరులకు అవకాశం
- స్థానిక నిరుద్యోగుల ఆశలు గల్లంతు

**మెట్‌పల్లి :** అదినుండి వివాదాలకు నిలయంగా మారిన మెట్ పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టులో మరో వివాదం మొదలయ్యింది. అధికారుల ధనదాహంతో స్థానిక నిరుద్యోగుల ఆశలు గల్లంతు అవుతున్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన అధికారిణి ఉన్నన్ని రోజులు రోజుకో వివాదం అంటూ రోజులు గడిచి పోయాయి. కాని అధికారిణి మారినా ప్రాజెక్ట్ గాడినపడ్డ దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. కానీ..మళ్ళీ మరో వివాదానికి మాత్రం తెరలేచింది. ప్రాజెక్ట్ లో అధికారులు మారినా వివాదాలు తప్పడం లేదంటూ చర్చ జరుగుతుంది.





### అధికారిణి మారిన అదే తీరు

శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మెట్ పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం ఐదు మండలాలు ఉన్నాయి.అవి మెట్ పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల, కథలాపూర్ మండలాల పరిధిలో 312 అంగన్వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. ఆయా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ప్రతి రోజు గర్భిణీలు 7082 మంది, బాలింతాలు 5817 పౌష్టికహారం అందుకుంటున్నారు. అదే కేంద్రాల్లో సున్నా నుండి మూడు సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు 39,151 ఉండగా, మూడు నుండి ఆరు సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు 31,190 మంది ఉన్నారు. ఇక ప్రాజెక్ట్ పరిధిలో సిడిపివో, సూపర్ వైజర్ల అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ తూ తూ మంత్రంగా సాగడం తో కేంద్రాల్లో పిల్లలు కనిపించడం లేదు. గతంలో ఉన్న అధికారిణి నిర్లక్ష్యంతో అంగన్వాడీలు గాడి తప్పడంతో కొత్త అధికారిణి బాధ్యతలు చేపట్టినా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ దారిలో పడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### ప్రాజెక్ట్‌లో మళ్లీ మొదలైన వివాదాలు

ప్రాజెక్ట్ పరిధిలో ఓ అంగన్వాడీ టీచర్ ను నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయడం స్థానిక అంగన్వాడీ టీచర్ల లో అసంతృప్తికి దారి తీస్తోంది.స్థానికంగా అర్హత కలిగిన అంగన్వాడీ టీచర్లను పక్కన పెట్టి ముడుపులు చెల్లించిన వారికి కోరుకున్న చోటుకు బదిలీ చేశారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే మెట్ పల్లి పట్టణంలోని 9.వ వార్డు సుల్తాన్ పురలో ఉన్న అంగన్వాడి టీచర్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నది. దీనితో తరచూ విధులకు గైర్ హాజరు కావాల్సి రావడం తో ఆమె రెండు నెలల క్రితం ఉద్యోగానికి రాజీనామా చేసింది. దీనితో అదే కాలనీకి చెందిన మరో అంగన్వాడి టీచర్ పట్టణంలోని మరో వార్డ్ లో విధులు నిర్వహించడం జరుగుతుంది. విషయం తెలిసిన ఆ అంగన్వాడీ టీచర్ తన కాలనీకి చెందిన అంగన్వాడి టీచర్ రాజీనామా చేయగా ఆ సెంటర్లో తనను నియమించాలని మెట్ పల్లి సిడిపివో కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వడం జరిగింది. అలాగే స్థానికంగా ఉన్న మరో ఇద్దరుతో కలిపి మొత్తం ముగ్గురు ఖాళీ అయిన కేంద్రానికి తమను బదిలీ చేయాలనీ దరఖాస్తు ఇచ్చినట్లు కార్యాలయ వర్గాలు తెలపడం గమనర్హం. కాని స్థానికంగా ఉన్న అంగన్వాడీ టీచర్లను పక్కన పెట్టి మల్లాపూర్ మండలం వాల్గొండ నుండి అంగన్వాడీ టీచర్ ను అధికారులు మెట్ పల్లి కి బదిలీ చేయడం జరిగింది.స్థానికులను వదిలి వేరే మండలం నుండి అంగన్వాడీ టీచర్ ను మెట్ పల్లికి బదిలీ చేయడంలో పెద్ద ఎత్తున ముడుపులు ముట్ట చెప్పారని ప్రాజెక్ట్ పరిధిలోని ఉద్యోగులు విమర్శలు చేస్తున్నారు. ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీ అయిన ఉద్యోగంకు కొత్తగా నోటిఫికేషన్ ఇస్తే స్థానిక నిరుద్యోగులకు అవకాశం వచ్చేది. కాని అధికారుల తీరుతో నిరాశ చెందిన స్థానికులు కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో పాటు ఆందోళన కార్యక్రమాలకు దిగడానికి సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి బదిలీని నిలిపివేసి స్థానికులకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.



# అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోను

- నా మీద కోపం ఉంటే జైల్లో పెట్టండి పేదవాడి జోలికి వస్తే ఊరుకోను
- కొంతమంది జోకర్లు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- హైడ్రా పేరుతో అధికారులు మితిమీరితే వారి డెడ్రా అవుతుంది
- క్రీడాకారులు అంటే నాకు ప్రాణం క్రీడలు అంటే నాకు గుండెకాయ
- నేను క్రికెట్ ఆడే రోజులు మళ్లీ గుర్తుకొస్తున్నాయి
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హుజూరాబాద్ :** తనమీద కోపం కాంగ్రెస్ ప్రభుత్వానికి కోపం ఉంటే జైల్లో పెట్టిన పర్వాలేదని, పేదవాడి జోలికి వస్తే ఊరుకోనని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికోసం రెడ్డి హెచ్చరించారు. ఆదివారం హుజూరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు బహుమతి ప్రధాన ఉత్సవం సందర్భంగా ఆయన ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. హుజూరాబాద్ క్రీడాకారుల కోసం ఎంతో ఆలోచించి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని ఒప్పించి పదికోట్లు తీసుకువచ్చానని అన్నారు. ఏప్రిల్ 28 2023 లో స్పోర్ట్స్ గ్రౌండ్ కు 10 కోట్ల రూపాయలకు టెండర్ కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మినీ స్టేడియం కోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రౌండ్ ఏర్పాటును అడ్డుకుందని, అభివృద్ధిని అడ్డుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏం వస్తుందో అర్థం కావడం లేదన్నారు. క్రీడాకారులు అంటే తనకు ప్రాణం అని క్రీడలు తన గుండెకాయ అని అన్నారు. తాను ఒక క్రీడాకారుని అయినందుకు హుజురాబాద్ లో కూడా ఎంతో మంది క్రీడాకారులు ఎదగాలని ఉద్దేశంతో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేసేందుకు సకల ప్రయత్నాలు చేసినప్పటికీ కాంగ్రెస్ అడ్డుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏదైనా కోపం ఉంటే కోపం ఉంటే తనమీద తీర్చుకోవాలి తప్ప క్రీడాకారుల మీద కాదన్నారు. కొంతమంది జోకర్లు 10 కోట్ల రూపాయలను తాను తీసుకువస్తే కేవలం 10 లక్షలు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. గ్రౌండ్ కు కేటాయించింది 10 లక్షలు కాదని 10 కోట్లను గుర్తించాలన్నారు. మినీ స్టేడియం కు అన్ని విధాల టెండర్ అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పని ఎందుకు ఆపుతుందో చెప్పాలన్నారు. కొంతమంది జోకర్లు వాకింగ్ ట్రాక్ కోసం పది లక్షల కేటాయించామని చంకలు గుద్దుకుంటున్నారని బీఆర్ఎస్ హయాంలో వాకింగ్ ట్రాక్ కోసం రెండు కోట్ల కేటాయించామన్నారు. హుజురాబాద్ లో అద్భుతమైన గ్రౌండ్ ఏర్పాటు చేయాలని తాను కన్న కలలన్నీ కాంగ్రెస్ పార్టీ నీళ్లు చల్లింది అన్నారు. ప్రతి కీర క్రీడాకారునికి అన్న అంటే నేనున్నానని ఎప్పటికీ స్పందిస్తానని హామీ ఇచ్చారు. హుజురాబాద్ లో కూడా హైడ్రా పేరుతో ప్రతాపవాడ, కిందివాడకు సంబంధించి పరిశీలన జరిగినట్లు తెలుస్తుందని, హైడ్రా పేరుతో ఏదైనా పేదవాడి ఇంటిని కూలగొట్టాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా అధికారులు అత్యుత్సాహంతో పేదవాళ్ల ఇళ్ల జోలికి వస్తే రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేననే విషయం మర్చిపోవద్దని అన్నారు. హైడ్రా పేరుతో అధికారులు మితిమీరితే తర్వాత వారి డెడ్రా అవుతుందని హెచ్చరించారు. హైడ్రా పేరుతో పేదవాడి ఇంటికి వచ్చి బెదిరిస్తే ఒక్క ఫోన్ కాల్ చేస్తే ఏ రాత్రి అయినా సరే వచ్చి మీతోనే అక్కడే పడుకుంటానని హామీ ఇచ్చారు. తన చిన్ననాటి నుంచి ఇదే మట్టి మైదానంలో ఆటలు ఆడుతున్నాం తప్ప టర్ఫ్ గ్రౌండ్లో ఆడేది ఎప్పుడు అని ఆయన ప్రశ్నించారు. హుజురాబాద్ లోని ప్రతి క్రీడాకారుడు మినీ స్టేడియం కోసం ప్రభుత్వాన్ని ఇక్కడి ప్రజాప్రతినిధులను నిలదీయాలని అన్నారు. క్రీడాకారులంతా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. హాకీ జాతీయ క్రీడా అని దీంతో ఒలింపిక్స్ లో కూడా మెడల్ సాధించాలని ఆయన క్రీడాకారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మాజీ మేయర్ , ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, హాకీ కోచులతోపాటు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.



# 100 కిలోల లక్క పట్టివేత

## 5గురు వ్యక్తులపై కేసు నమోదు

**వేమనపల్లి:** వేమనపల్లి మండలంలోని కల్లంపల్లి గ్రామంలో ఫారెస్ట్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా లక్కను తరలిస్తున్న ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు కుశ్నపల్లి ఫారెస్ట్ రేంజర్ దయాకర్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం చత్తీస్ ఘడ్,తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు వ్యక్తులు దహెగాం మండలంలోని రాంపూర్,మోట్లగూడం గ్రామ అడవులలో చెట్ల నుండి తీసిన సుమారుగా 100కిలోల లక్కను సేకరించి గల బొలెరో వాహనంలో తీసుకొని వెళ్తుండగా వారినీ అటవీ అధికారులు వెంబడించి పట్టుకున్నారని,ఒక్కరూ పరారీలో ఉన్నారని తెలిపారు.పట్టుకున్న వారిపై అటవీ సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ఒక బులోరా వాహనం రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేయడం జరిగిందని అలాగే పట్టుబడిన వారు జెన్న వెంకటేశ్వర్లు,దిండు చిరంజీవి,పవనూరు సత్యనారాయణ,సెడ్మెక సుధాకర్,దుర్గం సత్యనారాయణ,ఏలేశ్వరం మహేష్ నిందితులను పట్టుకున్నారు.ఫారెస్ట్ అధికారులు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రూపేష్,ఎఫ్ఎస్ఓ బేగ్,ఎఫ్బిఓ సాఫియా బేగం,బేస్ క్యాంప్ వాచర్స్ నాగేష్,వెంకటి రవి పాల్గొన్నారు.

# 9వ వార్డులో ప్రజా పాలన వారోత్సవాలు

**పాల్గొన్న కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి**



**కీసర, డిసెంబర్ 1 (నేటి ప్రస్థానం) :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ప్రజా పాలన వారోత్సవలలో భాగంగా ఆదివారం వార్డు పరిధిలోని ప్రధాన రహదారిపై మురికి నాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ కోమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డును క్రమం తప్పకుండ మురికినాలలను,రోడ్లను బహిరంగ ప్రదేశాలలో చెత్తాచెదారాన్ని శుభ్రపరచాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రాంరెడ్డి, ఎన్విలోన్మెంట్ ఇంజనీర్ ప్రశాంత్,వార్డు ఆఫీసర్ షాలిని,బిల్ కలెక్టర్ బిక్షపతి,సానిటరీ జవాన్ కుమార్, సుధాకర్ రెడ్డి,యాకయ్య, సత్యనారాయణ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి : చైర్మన్ చంద్రరెడ్డి

**నాగారంలో ప్రజా పాలన దినోత్సవం ప్రారంభం**

కీసర, డిసెంబర్ 1 (నేటి ప్రస్థానం) : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలో ప్రజాపాలన దినోత్సవాలు ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని శివాలయం నుండి ఎస్.వి నగర్ రోడ్డు వరకు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రరెడ్డి శుభ్రం చేసి ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా 20 వార్డులలో ప్రధాన రహదారులు, రాళ్లు, మట్టి కుప్పలను, పిచ్చి మొక్కలను తొలగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు, అన్నంరాజు సుమిత్ర సురేష్, బిజ్జా శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలం

**మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ**

**హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను ప్రజలు మెచ్చుకునే పరిస్థితి లేదని, ముఖ్యమంత్రి తన భుజం తానే తట్టుకుంటున్నారని, ఏడాది కాంగ్రెస్ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. 'ప్రభుత్వానిది సుపరిపాలన అని మీకు మీరు చెప్పుకోవడం కాదు. ప్రజలు చెప్పాలి. మీ అపరిపక్వత, అసమర్థత వల్ల రాష్ట్రంలో అన్నిరంగాల్లో ప్రతికూల వాతావరణం నెలకొంది. మేం మంచి ఆర్థికవృద్ధితో రాష్ట్రాన్ని అప్పగిస్తే, మీ రాక తర్వాత ఆశించిన మేరకు వృద్ధి రేటు పెరగలేదు. నెపం ప్రతిపక్షం మీదకు నెడుతున్నారు. రూ. 7లక్షల కోట్ల అప్పు అని ఏడాదిగా చెప్పిన అబద్ధాన్నే మళ్లీ మళ్లీ చెబుతున్నారు. తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న మొత్తం అప్పు రూ. 4,26,499 కోట్లు అని అసెంబ్లీ వేదికగా లెక్కలతో సహా నిరూపించాను. ఇప్పటికీ అదే సవాల్ చేస్తున్నాను. గత ఎన్నికలకు ముందు రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో వేసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొన్నాం. తెల్లవారితే ఖాతాల్లో వేస్తామని తొర్రూరు సభలో స్వయంగా నేనే ప్రకటించాను. రైతుబంధు ఖాతాల్లో పడితే మీకు ఓట్లు పడవని భయపడి.. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఆపింది మీరే. పార్లమెంటు ఎన్నికలకు ముందు మేం నిలదీస్తే రైతుల ఖాతాల్లో రూ.5 వేలే జమచేశారు. రూ. 7500 ఎందుకు వేయలేదు? రైతుబంధును మీరే ఆపిన విషయం, అధికారంలోకి వస్తే రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ తరపున ఇచ్చిన హామీ.. మీకు గుర్తులేకపోవచ్చు. ఆ ఫిర్యాదు కాపీని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను, మీరు మాట్లాడిన వీడియోను పంపుతున్నా' అని సీఎంను ఉద్దేశించి హరీశ్‌రావు పేర్కొన్నారు.





# ఘనంగా గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ జన్మదిన వేడుకలు

- గుండు మధుగౌడ్ ఆధ్వర్యంలో..
- శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు

**కీసర,డిసెంబర్ 1(నేటి ప్రస్థానం):** నాగారం మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ జన్మదిన వేడుకలను ఆదివారం తన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య కాలనీ గుండు మధుగౌడ్ ఆధ్వర్యంలో పలువురు అభిమానులు కలిసి స్థానిక కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛములు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అభివృద్ధిలో ముందుకు సాగుతున్న కౌన్సిలర్ గూడూరు సబిత 47 వసంతాలు విజయవంతంగా పూర్తి చేసుకుని శ్రీ వెంకట మరకత చంద్రమౌళీశ్వర స్వామి ఆశీస్సులతో 48వ వసంతంలో అడుగు పెట్టింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్పూర్తిగా ఆకాంక్షించారు. అనంతరం కేకును కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మధుగౌడ్, కృష్ణారెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, రాధాకృష్ణ, బిట్ల బాల్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, జైపాల్ రెడ్డి,రమణ, ఆనంద రాజ్, వేముల బిక్షపతి గౌడ్, నాయుడు, శ్రీశైలం,యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

## పట్నం సునీత మహేందర్ రెడ్డి

**కూకట్‌పల్లి, డిసెంబర్ 1 (నేటి ప్రస్థానం) :** నిరుపేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కాంగ్రెస్ నాయకురాలు పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని టెంపుల్ బస్ స్టాప్ సమీపంలో తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు రోగాల నిర్ధారణకు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించిన తెలంగాణ గౌడ సంఘం ప్రతినిధులను అభినందించారు. లైన్స్ క్లబ్ ఆఫ్ దోమల గూడ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో బి, పీ, ఈసీజీ, షుగర్, కంటి, ఒబేసిటీ,గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్, ఆర్థో,డైటీషియన్, న్యూరో,స్కిలిటన్, మజిల్, అసెస్మెంట్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి,డాక్టర్లు మణిశంకర్, సౌరబ్ చిల్లూరు, రాజారెడ్డి,జాహ్నవి, శ్రీనివాస్,అభిజీయాల్, కాంగ్రెస్ నాయకులు సంజీవ రావు,ప్రవీణ్ కుమార్,కూన సత్యం గౌడ్,శ్రీధర్ ఆచారి, గిరి నాయుడు, అక్బర్, మణి గౌడ్, కాంగ్రెస్ నాయకురాలు, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సంక్రాంతికి ఏపీలో కొత్త రేషన్‌కార్డులు

**అమరావతి:** రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులతో పాటు కొత్త కార్డులకు దరఖాస్తు చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ నెల 2 నుంచి 28 వరకు గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన వారికి సంక్రాంతి నుంచి కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డులపై వైకాపా రంగులతో పాటు జగన్ బొమ్మను ముద్రించారు. ఇప్పుడు వాటి స్థానంలో కొత్త కార్డులు ఇవ్వనున్నారు. దీనికి బడ్జెట్ కూడా విడుదలైంది.




# డిసెంబర్ 5 వరకు అమెజాన్‌లో వింటర్‌సేల్

**హైదరాబాద్ :** ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ వింటర్ సేల్‌ను ప్రారంభించింది. ఇది డిసెంబరు ఐదో తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సందర్భంగా హీటర్లు, బ్లాంకెట్స్, గీజర్లు, కిచెన్ వేర్ వంటి ప్రొడక్టులపై ఆఫర్లు, డిస్కౌంట్లు ఇస్తారు. ప్రైమ్ సభ్యులకు 30 నవంబర్ అర్ధరాత్రి నుంచే సేల్ మొదలవుతుంది. ఫిలిప్స్, హావెల్స్, బెర్జ్‌నర్, లైఫ్‌లాంగ్, హిట్, అగారో వంటి ఎన్నో ప్రముఖ బ్రాండ్స్ పైన డీల్స్ ఉన్నాయని అమెజాన్ తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ, వన్‌కార్డ్, యాక్సిస్ బ్యాంక్ ఈఎంఐకార్డ్స్‌పై 10శాతం వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ పొందవచ్చు.




# అమావాస్య రోజు అన్నదానం శ్రేష్టమైనది

**ఆర్యవైశ్య మహిళ విభాగం ఆధ్వర్యంలో..**

**కీసర, డిసెంబర్ 1 (నేటి ప్రస్థానం) :** అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అమావాస్య రోజు అన్నదానం చేయడం ఎంతో శ్రేష్టమైనదని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రరెడ్డి అన్నారు. ఆదివారం అమావాస్య రోజు సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ని జనని దవాఖాన సమీపంలో ఆర్యవైశ్య మహిళ విభాగం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ కౌకుట్ల చంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సనాతన ధర్మ సాంప్రదాయంలో భాగంగా జై వాసవి మాత కు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్యవైశ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మనిషి జీవితంలో ఏమిచ్చినా తృప్తి ఉండదు..కానీ కడుపునిండా అన్నం పెడితే ఇక చాలు అని తృప్తి కలిగి



ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్ర సురేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్‌పై ఘన విజయం

**కాన్‌బెరా:** ఆస్ట్రేలియాతో డే/నైట్ టెస్టు ముంగిట ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్‌తో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శ నతో అదరగొట్టి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గులాబీ బంతితో జరిగిన ఈ మ్యాచ్‌ను 50 ఓవర్ల చొప్పున నిర్వహించాలను కున్నారు. మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే వరుణుడు అంతరాయం కలిగించడంతో 46 ఓవర్లకు కుదిం చారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్ 43.2 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ సామ్ కాన్‌స్టస్ (107, 97 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) శతకం బాదాడు. 241 పరుగుల లక్ష్యాన్ని భారత్ 42.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇది ప్రాక్టీస్ మ్యాచ్ కాబట్టి మిగిలిన 3.1 ఓవర్లలో కూడా భారత్ బ్యాటింగ్ చేసింది. 46 ఓవర్లలో భారత్ 257/5 స్కోరు చేసింది. బౌలింగ్‌లో అదరగొ ట్టిన టీమ్‌ఇండియా.. బ్యాటింగ్‌లోనూ సత్తాచాటింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (45, 59 బంతుల్లో 9 ఫోర్లు), కేఎల్ రాహుల్ (27 రిటైర్డ్ హర్ట్ 44 బంతుల్లో 4 ఫోర్లు) శుభారంభం అందిం చారు. తర్వాత వచ్చిన శుభ్‌మన్ గిల్ (50 రిటైర్డ్ హర్ట్‌బీ 62 బంతుల్లో 7 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (42, 32 బంతులలో 5 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (42, 36 బంతుల్లో 5 ఫోర్లు), రవీంద్ర జడేజా (27, 31 బంతుల్లో) రాణించారు. నాలుగో స్థానంలో వచ్చిన కెప్టెన్ రోహిత్ (3) మాత్రం నిరాశ పర్చాడు. కోహ్లీ బ్యాటింగ్‌కు దిగలేదు. ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్ బౌలర్లలో చార్లీ ఆండర్సన్ 2, లాయిడ్ పోప్, రెన్‌షా చెరో వికెట్ పడగొట్టారు. డిసెంబరు 6 నుంచి భారత్, ఆసీస్ మధ్య రెండో టెస్టు (పింక్ బాల్ టెస్టు) ప్రారంభం కానుంది. డే/నైట్ జరిగే ఈ మ్యాచ్‌కు అడిలైడ్ ఓవల్ మైదానం ఆతిథ్యం ఇవ్వనుంది. ఆస్ట్రేలి యా పీఎం ఎలెవన్ బ్యాటర్లలో కాన్‌స్టస్‌తోపాటు తొమ్మిదో స్థా నంలో వచ్చిన హన్నో జాకబ్స్ (61బీ 61 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జాక్ క్లేటన్ (40బీ 52 బంతు ల్లో 6 ఫోర్లు) రాణించాడు. భారత బౌలర్లలో యువ పేసర్ హర్షి త్ రాణా (4/44) అదరగొట్టాడు. ఆకాశ్ దీప్ 2, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు.




## హైబ్రిడ్ మోడల్‌కు పీసీబీ రెడీ..

చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణలో పాకిస్తాన్ ఓ మెట్టు తగ్గినట్లు తెలుస్తోంది. హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరించాలని లేని పక్షంలో టోర్నీని మరో దేశానికి తరలిస్తామని ఐసీసీ అల్టిమేటం విధించడంతో పాకిస్తాన్ హైబ్రిడ్ మోడల్‌పై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ట్రోఫీలో హైబ్రిడ్ మోడల్‌కు పీసీబీ(పాకిస్తాన్ క్రికెట్ బోర్డు) ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఐసీసీ ముందు పీసీబీ మరో మెలిక పెట్టినట్లు మీడియా వర్గాలు తెలిపాయి. 2031 వరకు జరిగే అన్ని ఐసీసీ ఈవెంట్లను హైబ్రిడ్ మోడల్‌లోనే నిర్వహించాలని పీసీబీ షరతు విధించినట్లు తెలిసింది. ఐసీసీ రానున్న రోజుల్లో మూడు కీలక ఈవెంట్లను భారత్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో ఈ కండిషన్ విధించినట్లు తెలుస్తోంది. దీంతో పాకిస్తాన్ ఆడే మ్యాచ్‌లన్నింటిని తటస్థ వేదికలపైనే జరపాలని పీసీబీ ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చినట్లు సమాచారం. తాజా పరిణామాల నేపథ్యంలో పీసీబీ చైర్మన్ ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు హెడ్ ముబాషిర్ ఉస్మానీని దుబాయ్‌లో కలిశారు. ఉస్మానీ ఐసీసీ అసోసియేట్ మెంబర్లకు చైర్మన్‌గా సైతం వ్యవహరిస్తున్నారు. పాకిస్తాన్‌లో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని.. మెగా ఈవెంట్‌లో అన్ని దేశాలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఐసీసీ తమ షరతులకు ఓకే అంటేనే హైబ్రిడ్ మోడల్‌కు పీసీబీ అంగీకారం తెలపనున్నట్లు తెలుస్తోంది. తాజా పరిణామాల దృష్ట్యా రెండు దేశాల ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలు మరింత జఠిలం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ఇప్పటికే విడుదల కావాల్సి ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు టోర్నీని నిర్వహించాలని తొలుత భావించారు. ఇందుకు కరాచీ, లాహోర్, రావల్పిండిలను వేదికలుగా నిర్ణయించారు. స్టేడియంలలో సౌకర్యాలను సైతం మెరుగుపరుస్తున్నారు. అయితే భారత్-పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో టోర్నీ నిర్వహణ అంశం కొలిక్కొ రాలేదు. పీసీబీ తాజా ప్రతిపాదనపై ఐసీసీ ఎలా స్పందిస్తుంది అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## సన్ రైజర్స్‌లో ఆడటం వల్లే ఇండియా టీమ్‌లో చోటు దక్కింది

### నితీష్ కుమార్‌రెడ్డి ఎమోషనల్ కామెంట్స్

ఐపీఎల్ 2024లో సన్ రైజర్స్ జట్టులో సత్తా చాటిన యువ ప్లేయర్ నితీష్ కుమార్ రెడ్డి.. సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అయితే ఈ యువ ప్లేయర్‌ను హైదరాబాద్ జట్టు వేలంలోకి వెళ్లకుండా రూ. 6 కోట్లకు రిటైన్ చేసుకుంది. అయితే మెగా వేలంలోకి నితీష్ కుమార్ రెడ్డి వెళ్లి ఉంటే.. భారీ ధర పలికేవాడని.. సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. కాగా ఇదే విషయంపై నితీష్ కుమార్ రెడ్డిని ఓ ఇంటర్వ్యూలో.. ప్రశ్నించగా.. ఆయన ఎమోషనల్ కామెంట్స్ చేశాడు. తాను సన్ రైజర్స్ జట్టులో ఆడటం వల్లే నేనిప్పుడు ఇండియా జట్టు ఆడుతున్న.. డబ్బు మ్యాటర్ కాదు. బాగా ఆడితే.. డబ్బులు ఎప్పుడైన వస్తాయి.. నేను అప్పుడు సన్ రైజర్స్ జట్టుకు, ఇప్పుడు భారత జట్టుకు ఆడుతుంటే.. తెలుగు వాళ్ళు గర్విస్తారు. నేను ఒకవేళ వేరే జట్టుకు ఆడి ఉంటే.. మన అనే ఫీలింగ్ రాదంటూ.. ఎమోషనల్ కామెంట్స్ చేశాడు. కాగా దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో.. అతన్ని తెలుగు రాష్ట్రాల అభిమానులు ఆకాశానికి ఎత్తేస్తున్నారు.




## సచిన్ రికార్డును బ్రేక్ చేసిన జో రూట్

ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ మరో ఘనత అందుకున్నాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు (1630) చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అంతకుముందు ఈ రికార్డు సచిన్ తెందూల్కర్ (1625 పరుగులు) పేరిట ఉండేది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో రూట్ 23 పరుగులు చేసి ఈ ఫీట్ సాధించాడు. సచిన్ 60 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత అందుకోగా.. జో రూట్ కేవలం 49 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఇప్పటివరకు 150 టెస్టులు ఆడిన అతడు.. 12,777 పరుగులు చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఎక్కువ రన్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో ఇంగ్లాండ్ ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆదివారం 155/6 స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన కివీస్.. 254 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిచెల్ (84, 167 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) పదో వికెట్‌గా వెనుదిరిగాడు. న్యూజిలాండ్ నిర్దేశించిన 104 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 12.4 ఓవర్లలోనే ఛేదించింది. జాకబ్ బెథెల్ (50, 37 బంతుల్లో), బెన్ డకెట్ (27, 18 బంతుల్లో), జో రూట్ (23, 15 బంతుల్లో) పరుగులు చేశారు.




## ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జైషా

**దిల్లీ:** ఐసీసీ కొత్త ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షా నేడు బాధ్యతలు స్వీకరించారు. భారత్ నుంచి ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐదో వ్యక్తి జైషా కావడం విశేషం. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నికైన అతిపిన్న వయస్కుడిగా జై షా(36) గుర్తింపు దక్కించుకున్నారు. చివరగా భారత్ నుంచి శశాంక్ మనోహర్ 2015-20 మధ్య ఈ పదవిలో ఉన్నారు.

